www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 21 మార్చి 2023

5

చిత్తూరు



శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో

22న ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని 22న బుధవారం టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటుందని టీటీడీ ఆలయ అధ్యక్షులు సురేష్ కుమార్ తెలిపారు. సోమవారం ఆలయ అధికారి మాట్లాడుతూ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 4.15 గంటలకు సుప్రభాత సేవ, 4.15 నుంచి 4.30 వరకు శుద్ధి, 5 గంటలకు తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం వంటి కార్యక్రమాలు, 9.30 నుంచి 10.30వరకు స్వామివారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 3 గంటలకు ఉత్సవ సమర్పణ, ఉగాది ఆస్థానం, భక్తులకు సర్వదర్శన భాగ్యం కల్పించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 5.30 నుంచి 7.30 మధ్య తిరువీధి ఉత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

అరెస్టులతో ఉద్యమాలను అడ్డుకోలేరు..

గాంధీ విగ్రహం ఎదుట వామపక్షాల ధర్నా

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: అరెస్టులు, నోటీసులతో ఉద్యమాలను అడ్డుకోలేరని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు ప్రభుత్వాని హెచ్చరించారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం విడుదల చేసిన జీవో 1ని రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపు ఇవ్వడంతో పార్టీలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలను విజయవాడకు వెళ్లకుండా ముందుగానే జగన్మోహన్‌రెడ్డి పోలీస్‌శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసి 26 జిల్లాల్లో ఎక్కడిక్కడ హౌస్ అరెస్టు చేయడం, నోటీసులు తాఖీదు జారీ చేయడానికి వ్యతిరేకంగా సోమవారం సిపిఐ, సిపిఎం నాయకులు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రభుత్వంలో జరుగుతున్న వైఫల్యాలను, ప్రజావ్యతిరేక విధానాలను ఎండకట్టడానికి ప్రజాస్వామ్యబద్ధంగా రాజ్యాంగం కల్పించిన హక్కు ఉందన్నారు. రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు వారివారి సమస్యలను చెప్పుకునే స్వేచ్ఛ లేదని, ప్రతిపక్ష పార్టీలు రోడ్‌షోలు, ప్రదర్శనలు, సభలు సమావేశాలు నడపడానికి కూడా వీలు లేకుండా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రతిపక్షాల నొక్కడానికి బ్రిటిష్ కాలంనాటి చీకటి జీవో నెంబర్ 01 విడుదల చేశారని విమర్శించారు. జీవో నెంబర్ 1ని రద్దుచేయాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మికసంఘాలు పిలుపుమేరకు చలో విజయవాడ కార్యక్రమం చేపడితే విజయవాడ వెళ్ళనీకుండా పోలీసులు సహాయంతో అరెస్టులు గహనిర్బంధాలు నోటీసులు జారీ చేసిన ఉద్యమాలు, పోరాటాలు ఆగదని హెచ్చరించారు. ఇప్పటికైనా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజల మనోభావాలను అర్థం చేసుకొని జరుగుతున్న అసెంబ్లీలో జీవో 01వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉదతం చేస్తామన్నారు. చిత్తూరు నగర సిపిఐ కార్యదర్శి విసి.గోపీనాథ్, కే.విజయగౌరీ, ఏ.జమీలాబీ, పి.రఘు, పి.గజేంద్రబాబు, కే.నాగరాజు, కే.చంద్రయ్య బి.మునస్వామి పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు




స్పందనలో వినతుల వెల్లువ

అర్జీలు స్వీకరిస్తున్న జెసి



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వివిధరకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 324అర్జీలు రాగా, ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 189, పోలీసుశాఖకు 4, హౌసింగ్ శాఖ 13, విద్యా శాఖ 3, మైన్స్‌శాఖ 1, జిల్లా కోఆర్డినేటర్ గురుకుల 1, ఎక్సైజ్ శాఖ 1, డ్వామా 2, జిల్లా పరిషత్ 2, లేబర్ డిపార్ట్మెంట్ 1, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ 1, సివిల్ సప్లై 1, ఇరిగేషన్ 3, జిల్లా పంచాయతీ శాఖ 2, జిల్లా సైనిక్ వెల్ఫేర్1, మున్సిపల్ 3, ఎల్‌డిఎం 1, ఇతరులు 10, పింఛన్లు, రేషన్‌కార్డ్స్ 85 అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్ వినతులను అందజేశారు. రాష్ట్రప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద తరచూ సమీక్షిస్తున్నారని, జిల్లా అధికారులు వచ్చిన అర్జీల మీద సత్వరం చర్యలు గైకొని పరిష్కరించాల్సిందిగా డిఆర్‌ఓను, జిల్లా అధికారులను ఆదేశించారు. వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందన వినతులకు పూర్తిస్థాయి పరిష్కారం: కమిషనర్


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

స్పందన కార్యక్రమంలో అందే వినతులను క్షేత్రస్థాయిలో విచారించి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ విభాగాధిపతులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో భాగంగా కమిషనర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా స్పందన వినతుల పరిష్కారంపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ప్రతి వినతిపత్రాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, నిర్ణీత సమయంలో పరిష్కరించి నివేదించాలని అన్నారు. స్పందన కార్యక్రమంలో రెవెన్యూ-2, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్, మెప్మా ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఐదు వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ ధనలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి

స్పందన కార్యక్రమంలో 22 ఫిర్యాదులు స్వీకరించినట్లు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జగదీష్ తెలిపారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులను ఆయన నేరుగా స్వీకరించారు. అందిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి నిర్దేశించిన గడువులోగా త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ అడిషనల్ ఎస్పీ బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మొత్తం 22 ఫిర్యాదులు అందాయి. వాటిలో చీటింగ్ 2, వరకట్న వేధింపులు 1, వేధింపులు 9, కుటుంబతగాదాలు 4, ఆస్తి తగాదాలు 2, భూ తగాదాలు 2, మోటార్ సైకిల్ దొంగతనాలు 2 ఉన్నాయి. కార్యక్రమం అనంతరం జనవరి 3వ తేదీన విధులు నిర్వహిస్తూ అనారోగ్యం కారణంగా మరణించిన సి.మురుగేశన్ భార్య సుమితకి ఫ్లాగ్ ఫండ్ నుండి రూ.10వేల రూపాయల చెక్కును అందజేశారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ జగదీష్

రంగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- నగరి: తాగునీటి పారుదల కాలువల్లో డైయింగ్, వాషింగ్ యూనిట్ల నుంచి వచ్చే రంగునీరు ప్రవహిస్తోందని ఆ సమస్యను పరిష్కారించాలని కోరుతూ మున్సిపల్ పరిధి కరకంతాపురం గ్రామానికి చెందిన ప్రజలు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డికి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో రంగునీటి సమస్యల పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.



ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎస్ఐ


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ దస్తగిరి

ప్రజాశక్తి- కార్వేటినగరం: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ఎస్ఐ దస్తగిరి అన్నారు. సోమవారం చిత్తూరు -పుత్తూరు జాతీయ రహదారిపై బంగారమ్మ ఆలయం సమీపంలో నాకా బంధీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్రవాహన దారులకు హెల్మెట్ తప్పనిసరిని వినియోగించాలని, లైసెన్సుతో పాటు వాహనాలకు సంబంధించిన రికార్డులు వారి వద్ద ఉండాలని సూచించారు. అదే విధంగా 18 సంవత్సరాలు లోపు ఉన్న వారు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే వారి తల్లిదండ్రులకు కఠిన శిక్ష తప్పదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, ఆటోల్లో పరిమితికి మించిన ప్యాసింజర్లను ఎక్కించిన వారిపై కూడా కేసులు నమోదుచేసి, భారీగా జరమాన విధిస్తామని పేర్కొన్నారు. ఏఎస్ఐ మునికష్ణ, సిబ్బంది పలువురు ఉన్నారు.

నాడు- నేడు పనులను ప్రారంభించండి

ఎంపీడీవో నాగరాజు

ప్రజాశక్తి -సోమల: మండలంలో రెండవ విడతలో ఎంపిక చేయబడిన పాఠశాలలలో నాడు- నేడు పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపీడీవో నాగరాజు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కోరారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం రెండవ విడతలో ఎంపిక కాబడ్డ 27పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడత నాడు- నేడు పనులను పాఠశాలల్లో దాదాపు 90శాతం పూర్తి చేయడం ప్రశంసనీయమని అన్నారు. మిగిలిన 10 శాతం పనులను కూడా ఆయా పాఠశాలలో వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. రెండవ విడతలో నాడు-నేడు కింద 29 పాఠశాలలకు గాను 27 పాఠశాలలకు రూ.78,28,852ల నిధులు మంజూరయ్యాయని వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ కేశవ పిళ్ళై, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై హమాలీలకు కూలి రేట్లు పెంచాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పౌరసరఫరాల శాఖలో గోడౌన్లలో పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వ అగ్రిమెంట్ ప్రకారం కూలిరేట్లు పెంచాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట హమాలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హమాలీల సంఘం రాష్ట్ర నాయకులు మురళి మాట్లాడుతూ సివిల్ సప్లై వ్యవస్థలో పనిచేస్తున్న హమాలీలకు 2018లో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారమే కూలీలు చెల్లిస్తున్నారని, ప్రభుత్వం కూలి రేట్లు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సివిల్‌సప్లై అధికారులు, డీటీలు, డీలర్లు హమాలీలను వేధించడం మానుకోవాలని అన్నారు. హమాలీల సమస్యలపై అనేకమార్లు సివిల్ సప్లై అధికారులు దష్టికి తీసుకుపోయిన ఏమాత్రం పట్టించుకోకుండా సమస్యలు పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు, హమాలీలు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల ఏర్పాటు చేసి పొదుపుతో పాటు బ్యాంకు రుణాలను పొందేందుకు సహకరిస్తున్న సంఘమిత్రల (విఓఏ) సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, వీఓఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీవోఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట వివోఏలు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా గంగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం వీవోఏలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన సర్క్యులర్ 64ను వెంటనే రద్దు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేసి మూడునెలల కాలపరిమితిని విధించడాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా వీవోఏలపై రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయని వీటిని అరికట్టాలన్నారు. వీవోఏల సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే పోరాటాలను ఉదతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామీణప్రాంతాలలో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి స్వయం సహాయక సంఘాల్లో పనిచేస్తున్న మహిళలకు అండగా నిలుస్తున్న వీవోఏలపై ఇటీవల కాలంలో రాజకీయ వేధింపులు పెరిగాయన్నారు. అలాగే దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం నాయకులు నాగరాజు, వసంత, శేషాద్రి లతోపాటు వివిధ మండలాలకు చెందిన వీవోఏలు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఓఏలు

దళితుల భూమిలో దౌర్జన్యం

భూమి ఇప్పించండి అంటూ వేడుకోలు..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న త్యాగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సాగులో ఉన్న భూమిని ఆక్రమించుకునేందుకు దౌర్జన్యాన్ని పాల్పడుతున్న గంగాధర నెల్లూరు రౌడీషీటర్ జగన్‌బాబు నుంచి రక్షణ కల్పించాలని గంగాధర నెల్లూరు దళితవాడకు చెందిన త్యాగరాజన్, మోగిలయ్యలు చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాను ఆశ్రయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 559/1లో రెండు ఎకరాల 22సెంట్లు భూమిని తాము 70 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. అయితే గంగాధరనెల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న రికార్డు అసిస్టెంట్ ఇంజం పంచాయతీ చింతారెడ్డిపల్లికి చెందిన చెంగల్‌రాయులు అతని భార్య సరస్వతిపై అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకం చేయించుకున్నాడని తెలిపారు. 1999 సంవత్సరంలో తాము సాగు చేసుకుంటున్న భూమిపై పట్టా తీసుకోవడం జరిగిందని, అయితే మూడవ వ్యక్తి రౌడీషీటర్ జగన్‌బాబు ఈభూమిని తాను కొనుగోలు చేశానని ఈ భూములో ఎవరు ప్రవేశించకూడదని తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అతని నుంచి ప్రాణహాని ఉన్నదని తమకు రక్షణ కల్పించాలని, సరస్వతి పై ఇచ్చిన అక్రమ పట్టాను రద్దుచేసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

పిఇఎస్‌లో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి- గుడిపల్లి: పిఇఎస్ మెడికల్ కళాశాలలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లా సుందుపల్లెకు చెందిన సోములమ్మ సుమారు 20 సంవత్సరాల నుంచి కుడిచెంపపై ప్లియో మార్ఫిక్ ఆడినోమా గడ్డతో బాధపడుతుంది. ప్రాణభయంతో ఎటువంటి వైద్యుసేవలు పొందకుండా బాధను భరిస్తూనే ఉంది. దీంతో ఆమె సమీప బంధువులు చిత్తూరులోని పిఇఎస్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యుశిబిరంకు ఆమె తీసుకువచ్చి వైద్యులను సంప్రదించారు. వైద్యులు పరిశీలించి ఉచితంగా శస్త్రచికిత్స చేస్తామని చెప్పారు. దీంతో కుప్పం పిఇఎస్ జనరల్ సర్జన్ విభాగంలో గత నెలల్లో అడ్మిట్ చేయడం జరిగింది.


చికిత్సకు ముందు చికిత్స తర్వాత

జనరల్ సర్జరీ విభాగాధిపత్తి చిన్నన్న, క్యాన్సర్ శస్త్రచికిత్స వైద్యులు గురు రాఘవేంద్రల నేతృత్వంతో అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించి సుమారు కేజీ బరువుగల గడ్డను పెరితోడి శస్త్రచికిత్స నిర్వహించి తొలగించారు. ఈ ఆపరేషన్‌ను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పూర్తిగా ఉచితంగా చేసినట్టు వైద్యులు తెలిపారు. ప్రస్తుం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా పిఇఎస్ వ్యవస్థాపకులు దొరస్వామి ఆపరేషన్ చేసిన వైద్యబృందాన్ని అభినందించారు. ఆయన మాట్లాడుతూ అనేక రకాల వ్యాధులతో బాధపడుతూ చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత లేని వారికి వైద్యం అందించడానికి శస్త్రచికిత్సలపై అవగాహన కల్పించానికి అనేక ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

స్కూల్ పిల్లలకు రాగి జావ

నేటి నుంచి పంపిణీ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాగి జావా పంపిణీ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉదయం 11 గంటలకు లాంఛనంగా ప్రారంభించనున్నారు. జిల్లాలోని ప్రభుత్వపాఠశాలల్లో మంగళవారం ముఖ్యమంత్రి ప్రారంభ కార్యక్రమం అనంతరం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల పారెంట్స్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయదర్ రావు తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని ఆ పాఠశాల మిడ్‌డే మీల్ వర్కర్లకు సమాచారం అందించాల్సి ఉంటుంది. ప్రతి విద్యార్థికి 150 ఎంఎల్ రాగి జావా అందించాలి. విద్యార్థుల సంఖ్యను బట్టి ఒక్కో విద్యార్థికి 100 గ్రాముల రాగి పిండి, 100 గ్రాముల బెల్లం చొప్పున ఎంత మంది విద్యార్థులుంటే ఒక్కో విద్యార్థికి 100 గ్రాముల రాగిపిండి 100 గ్రాముల బెల్లం కలిపి పరిశుభ్రమైన గిన్నెలు వేడిచేసి స్టీల్ గ్లాసుల్లో అందించాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, యాజమాన్య పాఠశాలలకు సోమవారం ఆదేశాల అందాయి. విద్యార్థుల్లో పోషక విలువలను పెంచి శారీరక దారుఢ్యం పెరిగేలా రాగి జావా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావా పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానుంది.

హైస్కూల్‌ను తనిఖీ చేసిన జెడ్‌పి సీఈవో

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: నెల్లెపల్లి గ్రామసచివాలయం, హైస్కూల్‌ను జెడ్‌పి సీఈవో ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నెల్లెపల్లి గ్రామ సచివాలయంలో ప్రభుత్వ పథకాలు, అర్హులైన లబ్ధిదారుల జాబితా తెలిపే డిస్ప్లే బోర్డులను, పలు రిజిస్టర్లు, రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం నెల్లేపల్లె హైస్కూల్‌ని తనిఖీచేసి తరగతి గదిలోకి వెళ్ళి పలు పాఠ్యాంశాలపై విద్యార్థుల ద్వారా సమాధానం అడుగు తెలుసుకున్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెడ్మాస్టర్ రమేష్, పలువురు సచివాలయం అధికారులు పాల్గొన్నారు.


హైస్కూల్లో విద్యార్థినులతో మాట్లాడుతున్న జెడ్‌పి సీఈఓ

ఇళ్లనిర్మాణ పనులను వేగవంతం చేయండి

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: జగనన్న లేఅవుట్, జగనన్న ఇళ్ళపథకాల్లో ఇళ్లనిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీదేవి లబ్దిదారులను కోరారు. గంగాధర నెల్లూరు పంచాయతీలోని నల్లరాళపల్లె, ముక్కళత్తూరు పంచాయతీలోని ఎం.నాశంపల్లెకు సమీపంలో కొత్తగా జరుగుతున్న జగనన్న ఇళ్లనిర్మాణ పనులను ఎంపీడీవో సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలువురు ఇళ్లనిర్మాణ లబ్దిదారులతో మాట్లాడి వారి వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుండి ఇంటి నిర్మాణ బిల్లులు వస్తున్నాయని పేర్కొన్నారు.


నల్లరాళపల్లెలో ఇళ్లనిర్మాణ పనులను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

సంపూర్ణ ఆహారంపై అవగాహన

ప్రజాశక్తి- నగరి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట పరిధిలోని కీళపట్టు, వీకేఆర్‌పురం, టీఆర్ కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ్ పక్వాడా సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటి సందర్శన, ఆహార ప్రదర్శన, తక్కువ ధర న్యూట్రిషన్ ఫుడ్‌పై అవగాహన లాంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీడీపీవో కష్ణవేణి తల్లులకు సంపూర్ణ పోషణపై అవగాహన ఏర్పరిచారు. ప్రతి రోజూ ఆహారంలో మిల్లెట్స్ కలిపి తీసుకోవడం వలన చక్కటి ఆరోగ్యం సిద్దిస్తుందన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమ ప్రణాళిక మార్చి 20 నుంచి ఏప్రిల్ 2023 వరకు వివిధ రకాల కార్యక్రమాలతో నిర్వహిస్తామన్నారు. వీటి ద్వారా తల్లులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.శంకరమ్మ, కె.శ్యామల, జె.లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు కస్తూరి, శివగామి, దేవిక, ధనలక్ష్మి, గోపి ఆయాలు, తల్లులు, ఏఎన్‌ఎంలు, ఆషావర్కర్లు పాల్గొన్నారు.



నగరిలో..

చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవాలి

విజయపురం: మండలంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత, పోషణకు సంబంధించిన నినాదాలతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఈనెల 20 నుండి ఏప్రిల్ 3 వరకు అన్ని డిపార్ట్‌మెంట్స్‌ని కలుపుకొని వివిధ కార్యక్రమాలు నిర్వహించన్నుట్లు టిడిపి ఓ.శోభారాణి తెలిపారు. పిల్లలకు ఇచ్చే ఆహారంలో చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవాలని, వాటిల్లో ఎక్కువగా పోషక విలువలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్, ఎంఈఓ ఆంజనేయులు, అంగన్వాడీ సూపర్వైజర్ మరియమ్మ, శ్రీదేవి, సుమతి అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.


విజయపురంలో అవగాహన ర్యాలీ

'పురాతన' చిందేపల్లి రోడ్డుపై...

ల్యాంకో పెత్తనం..!



కేంద్రమంత్రి అండతో రెచ్చిపోతున్న వైనం

రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకున్నా గేటు ఏర్పాటు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

చిందేపల్లి లింక్ రోడ్డును మూసేస్తూ ల్యాంకో పరిశ్రమ(ఎలక్ట్రో క్యాస్టింగ్ లిమిటెడ్) యాజమాన్యం దౌర్జన్యంగా గేటు ఏర్పాటు చేయడం వెనక కేంద్ర పెద్దల హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకున్నా కేంద్ర పెద్దల అండ చూసుకుని ల్యాంకో యాజమాన్యం రెచ్చిపోతోందన్న విమర్శలూ లేకపోలేదు. వ్యాపారం కోసం ఊరు కాని ఊరొచ్చి..గ్రామస్తుల రోడ్డును ఇన్నాళ్లూ వాడుకునీ, అవసరం తీరాక ఆ రోడ్డునే కబలించేంత కండకావారం కేంద్ర పెద్దలిచ్చిందే కదా..! అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రంలో ఉన్న ఓ మంత్రి అండ చూసుకుని ల్యాంకో ఎండీ ఆ పరిశ్రమ పరిసర గ్రామాలపై దౌర్జన్యకాండకు దిగుతున్నారంటూ ప్రజలు బహిరంగగానే విమర్శలు చేస్తున్నారు. అక్రమంగా పోలీసులను వాడుకుని తమపై తిరుగుబాటు చేసే కార్మికుల నుంచి గ్రామస్తుల వరకూ అణచివేతకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు కోకొల్లలు.

అనధికారంగా గేటు ఏర్పాటు

స్వాతంత్ర్యం రాకమునుపు నుంచే చిందేపల్లి రోడ్డు వాడుకలో ఉంది. శ్రీకాళహస్తి -తిరుపతి రోడ్డు కోళ్ల ఫారం నుంచి చిందేపల్లి మీదుగా ఈ లింకు రోడ్డు వెంకటగిరి ప్రధాన మార్గంలో కలుస్తుంది. 2016 వరకు ఈ రోడ్డు గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. ఆ తదనంతరం 2016 ఏప్రిల్ లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక జీవో ప్రకారం ఆర్ అండ్ బీ రోడ్డుగా అవతరించింది. కోళ్లఫారం నుంచి ప్రారంభమయ్యే ఈ రోడ్డు చిందేపల్లి మీదుగా పది కిలోమీటర్లు వెంకటగిరి ప్రధాన మార్గంలో కలుస్తుంది. సుమారు 5 గ్రామాల ప్రజలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇదిలా ఉండగా 30 ఏళ్ల కిందట కోళ్ల ఫారం వద్ద ల్యాంకో కర్మాగారం పురుడు పోసుకుంది. ఆ దరిమిలా ఇన్నాళ్లపాటు ల్యాంకో కర్మాగారం చిందేపల్లి రోడ్డునే తమ ప్రధాన రోడ్డు మార్గంగా వినియోగించుకుంటూ వస్తోంది. అయితే చిందేపల్లి రోడ్డుకు ఎగువభాగాన ల్యాంకో మరో ప్లాంటును ఏర్పాటు చేసుకోవడంతో ఆ యాజమాన్యానికి చిందేపల్లి లింక్ రోడ్డుపై కన్ను పడింది. రోడ్డును తమ పరిశ్రమలో కలుపుకునేందుకు పలుదఫాలుగా దౌర్జన్యాలకు దిగింది. అయితే గ్రామస్తులు అడ్డుకోవడంతో రెండు పర్యాయాలు రెవెన్యూ, పోలీసుల సమక్షంలో పంచాయతీ చేసి చిందేపల్లి రోడ్డును ఉంచాలని తీర్మానం చేశారు. అయితే అప్పటినుంచి గత కొన్నేళ్లుగా ఫ్యాక్టరీకి, గ్రామస్తులకు మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా ఉన్నాయి. అయితే ఈ మధ్య ఆ పరిశ్రమకు కొత్త ఎమ్‌డి రావడం, ఓ మాజీ పోలీస్ అధికారి పీఆర్వో కావడంతో చిందేపల్లి రోడ్డును మూసి వేసేందుకు పన్నాగం వేశారు. పరిశ్రమ ఎమ్‌డికి కేంద్రంలోని ఓ మంత్రి కుమార్తెతో సాన్నిహిత్యం ఉండడంతో మరోసారి చిందేపల్లి రోడ్డును మూసేసి గేటును ఏర్పాటు చేయడంలో విజయవంతమయ్యారు.

ఆదేశాలు లేకనే పరిశ్రమకు పోలీసు రక్షణ

అనాదిగా వాడుకలో ఉన్న ఓ రోడ్డును మూసేసి తమ గేటును ఏర్పాటు చేయడంలో ల్యాంకో యజమాన్యానికి పోలీసులు రక్షణ కల్పించడంపై ఆరోపణలు వస్తున్నాయి. తమ రోడ్డును మూసేశారంటూ ఓ ప్రైవేటు పరిశ్రమ వద్ద గ్రామస్తులు ఆందోళనకు దిగితే వారికి మద్దతుగా నిలవాల్సిన రెవెన్యూ, పోలీసులు పరిశ్రమ యాజమాన్యానికి అండగా నిలవడం సైతం విమర్శలకు దారితీస్తుంది. అసలు ప్రైవేట్ పరిశ్రమకు రక్షణ కల్పించాలని అటు పోలీసు ఉన్నతాధికారి నుంచి గాని, ఇటు రెవెన్యూ అధికారి నుంచి గాని ఎలాంటి మౌఖిక ఆదేశాలు అందలేదని తెలుస్తోంది. ఈ విషయంపై ఆర్డిఓ రామారావును వివరణ కోరగా పరిశ్రమ వద్ద పోలీసు భద్రత ఏర్పాటు చేయాలంటూ తమాకెలాంటి ఆదేశాలు రాలేదని వివరణ ఇవ్వడం గమనార్హం. ఇదే విషయంపై ఓ పోలీస్ అధికారిని వివరణ కోరగా తమకు ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయంటూ నవ్వుతూ సమాధానం దాటవేయడం గమనార్హం.

మా రోడ్డును వదులుకోం : ఆనందరెడ్డి చిందేపల్లి




చిందేపల్లి రోడ్డు మా పూర్వీకుల నుంచి మాకు సంక్రమించింది. అనాదిగా ఈ రోడ్డునే ప్రధాన రహదారిగా వాడుకుంటూ వస్తున్నాం. పైగా దీన్ని ఆర్ అండ్ బి రోడ్డుగా మార్చి ప్రభుత్వం అభివద్ధి చేసింది. ఈ క్రమంలో మాకు మరో దారి ఏర్పాటు చేస్తామని ల్యాంకో పరిశ్రమ చెప్పడం విడ్డూరం. మా రోడ్డును సాధించుకునేంతవరకు పోరాటం ఆపేది లేదు.



ఫ్యాక్టరీ ఎదుట నిరసన (ఫైల్)

దౌర్జన్యకారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయండి

చిందేపల్లి లింక్ రోడ్డును అక్రమంగా మూసి వేయడమే కాకుండా, అడ్డుకున్న గ్రామస్తులను దౌర్జన్యంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడంలో కీలక పాత్ర పోషించిన ల్యాంకో యాజమాన్యంతో పాటు రెవెన్యూ, పోలీసు అధికారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బాధిత గ్రామస్తులు సోమవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. వారికి సిఐటియు, జనసేన, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మద్దతుగా నిలిచారు. సిఐటియు నాయకుడు పెనగడం గురవయ్య మాట్లాడుతూ ల్యాంకో యాజమాన్యం అక్రమంగా చిందేపల్లి లింక్ రోడ్డును మూసివేసిందని మండిపడ్డారు. గ్రామస్తులకు ముందస్తు సమాచారం లేకుండానే రోడ్డును మూసివేసి గేటును ఎలా ఏర్పాటు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనధికారికంగా రోడ్డును మూసివేసి గేటు ఏర్పాటు చేస్తున్న ల్యాంకో పరిశ్రమ వద్దకు పోలీసులు ఎలా వస్తారనీ, వచ్చినా బాధితులను ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలంలో గేటు ఏర్పాటు చేయడం నేరమనీ, ఎదురు తిరిగిన గ్రామస్తులను దౌర్జన్యంగా అరెస్టు చేసి స్టేషన్లో పెట్టడం శిక్షార్హం అన్నారు. వెంటనే ఆర్డీవో చిందేపల్లి గ్రామస్తులపై దౌర్జన్యకాండకు దిగిన ల్యాంకో యాజమాన్యంతో పాటు రెవెన్యూ పోలీస్ అధికారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్య పరిష్కరిస్తామని ఆర్డీవో రామారావు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సిఐటియూ నాయకులు గంధం మణి, రంగయ్య, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి వినుత కోట, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకుడు పుణ్యమూర్తి, చిందేపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.



సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట గ్రామస్తుల నిరసన

సెకండ్ బ్యాచ్ ఎఎన్ఎమ్‌లకు

ప్రొబిషన్ పూర్తిచేసి రెగ్యులరైజ్ చేయాలి

ఎఎన్ఎమ్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి సాంబశివ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సెకండ్ బ్యాచ్‌లో గ్రామ, వార్డు సచివాలయ ఏఎన్ఎమ్స్, హెల్త్‌సెక్రెటరీలుగా నియామకం అయ్యి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏఎన్ఎమ్స్ హెల్త్ సెక్రెటరీలకు తక్షణమే ప్రొబిషన్ పూర్తిచేసి రెగ్యులరైజ్ చేయాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఏఎన్ఎమ్స్ హెల్త్‌సెక్రెటరీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఆమేరకు ఏఎన్ఎమ్స్‌తో కలిసి జిల్లా డిఎం అండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఏఓకు కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సెకండ్ బ్యాచ్‌లో దాదాపు 60 మందికి పైబడి ఏఎన్ఎమ్స్‌గా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రొబిషన్ పూర్తిచేయాలని అనేకసార్లు అధికారులకు తెలియజేసిన ఇంతవరకు ప్రొబిషన్ డిక్లేర్ చేసి రెగ్యులరైజ్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి తక్షణమే ప్రొబిషన్ డిక్లేర్ చేసి ఏఎన్ఎమ్స్‌ను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ చిత్తూరు పట్టణ కార్యదర్శి సత్యమూర్తి, బాలాజీ ఏఎన్ఎమ్స్ పాల్గొన్నారు.

అన్నదానాన్ని అడ్డుకున్న అగ్రకులస్తులు

చర్యలు తీసుకోవాలని జెపి వెల్నెస్ ఫౌండేషన్ డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సేవాభావంతో పేదలకు అన్నదానం చేసేందుకు ముందుకు వచ్చిన జెపి వెల్నెస్ ఫౌండేషన్‌ను అడ్డుకోవడం అత్యంత దారుణమని జెపి ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ జయప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జయప్రకాశ్ మాట్లాడారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 18వ తేదీ నుంచి కుప్పం నియోజకవర్గం శాంతిపురం వద్ద జాతీయ రహదారి సమీపంలో ప్రభుత్వ పోరంబోకు స్థలంలో సెమియానా ఏర్పాటు చేసుకొని అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దళితులు అన్నదానం నిర్వహించడంపై ఆగ్రహించిన అగ్రకులస్తులు కొందరు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు సెమియానా వేశారంటూ కూల్చివేసి అన్నదానాన్ని అడ్డుకున్నారని తెలిపారు. రోజుకు 300 నుండి 400 మందికి అన్నదానం కార్యక్రమాన్ని నేటికీ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు తమ ఫౌండేషన్‌కు ప్రభుత్వస్థలాన్ని కేటాయించి పేదల అన్నదాన కార్యక్రమం కొనసాగింపుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మానవహక్కుల సంఘం నాయకులు డివి.మునిరత్నం, వేలాయుధం మణి, రాజేశ్వరి, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో నలుగురికి జైలుశిక్ష

ప్రజాశక్తి- నగరి : ఘర్షణ కేసులో స్థానిక సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో నలుగురికి జైలుశిక్ష, జరిమానా విధించినట్లు సీఐ శ్రీనివాసంతి తెలిపారు. 2017 ఏడాది రంజిత్ కుమార్, యువరాజ్, హేమంత్ కుమార్, లక్ష్మి అనేవారు తనపై దాడిచేసి తన పళ్లురాలగొట్టారంటూ కొత్తపేటకు చెందిన కెఎస్.వాసు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అప్పుడు ఎస్ఐగా ఉన్న విక్రమ్ కేసు నమోదు చేశారు. ఈకేసు సోమవారం విచారణకు వచ్చింది. అడిషనల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ ఎం.రామశాంతి వాదనలు విన్న జ్యూడిసన్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.విష్ణువర్మ నిందితుల్లో ఏ1 ముద్దాయికి ఏడాది జైలు శిక్ష రూ.2500 జరిమానా, ఏ2 నుంచి ఏ4 ముద్దాయిలకు 3నెలల జైలు శిక్ష రూ.500లు జరిమానా విధించారు. కోర్టు కానిస్టేబుళ్లు నవీన్, మేఘవర్ణం, కోమల ముద్దాయిలను జైలుకు తరలించారు.

కారు ఢీకొని ద్విచక్ర వాహనం దగ్ధం

ప్రజాశక్తి-పులిచెర్ల: పులిచెర్ల-రొంపిచెర్ల మార్గమధ్యంలోని బీవీ.రెడ్డి మామిడి తోట సమీపంలో సోమవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలు కాగా ద్విచక్రవాహనం మంటల్లో పూర్తిగా కాలిపోయింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పులిచెర్ల మండలం రాయవారిపల్లి పంచాయతీ పుచ్చలవారిపల్లెకు చెందిన మోహన్ తన టీవీఎస్ ఎక్సెల్లో సొంతపనుల నిమిత్తం రొంపిచర్లకు వెళుతున్నాడు. రొంపిచర్ల నుంచి పులిచెర్ల వైపు వెళుతున్న షిఫ్ట్ డిజైర్ కారు టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని ఢీ కొంది ధీంతో ద్విచక్రవాహనం పెట్రోల్ ట్యాంకు పగిలి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. వాహనం నడుపుతున్న మోహన్ కుడికాలుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





దగ్ధమైన ద్విచక్రవాహనం, గాయపడిన మోహన్

సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు వర్క్‌షాప్



ప్రజాశక్తి-గంగవరం: మదర్‌థెరిసా కళాశాలలో ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులకు ఏర్పాటు చేసిన వర్క్‌షాప్ కళాశాల కరస్పాండెంట్ ఎం.రవీంద్రబాబు సోమవారం ప్రారంభించారు. కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఈ ట్యాబ్ సాఫ్ట్వేర్ ఆర్‌జిఐసి అనే అంశంపై వారం రోజులుపాటు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విజయవాడలోని లెర్నెంట్ స్కిల్స్ అనే సంస్థలో పనిచేసే వి.మురళీకృష్ణ, అనూషల ఆధ్వర్యంలో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తారు. ఈ వర్క్‌షాప్‌లో భూగర్భంలో ఉన్న ఖనిజాలను వెలికి తీసే ప్రక్రియకు సంబంధించిన సాఫ్ట్వేర్ పనితీరును విద్యార్థులకు వివరిస్తారని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో 90మంది సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొంటారని, వర్క్‌షాప్ ఈనెల 26వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎంఆర్.సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి, సివిల్ ఇంజినీరింగ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ తరుణ్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలోకి 60 కుటుంబాలు



ప్రజాశక్తి- కుప్పం: కుప్పం నియోజకవర్గం దళిత నాయకుడు కన్నన్ ఆధ్వర్యంలో సుమారు 60 వైసిపి కుటుంబాలు విజయవాడలో చంద్రబాబు నాయుడు సమక్షంలో సోమవారం నాడు చేరినట్లు వారు తెలిపారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన వైసిపి నాయకులు విజయ్ కుమార్, మునుస్వామి, సురేష్ మాట్లాడుతూ వైసిపిలో కష్టపడి పనిచేస్తున్నా తగిన గుర్తింపు ఇవ్వనందున మనస్థాపం చెంది పార్టీవీడి తెలుగుదేశంలో చేరినట్లు వారు తెలిపారు. అదేవిధంగా మండలస్థాయిలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరు కషి చేస్తామని చంద్రబాబు గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపి కండువా కప్పుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిఎస్.మునిరత్నం, త్రిలోక్, గోపి, బిఎంకె. రవి వెంకటేశు, కలై, మురుగేష్, సామిడి, ధర్మ, రాజు, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు

ఆయుర్వేద ఆస్పత్రిని ఆధునీకరించాలి : టిటిడి

ప్రజాశక్తి- తిరుపతి సిటి : ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రిని ఆధునీకరించి మరింత అభివద్ధి చేయాలని టీటీడీ జేఈవో సదా భార్గవి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని ఎస్వీ ఆయుర్వేద కళాశాల, ఆసుపత్రిని సోమవారం జేఈవో అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో శల్య తంత్ర విభాగము, ద్రవ్య గుణ, రసశాస్త్ర సిద్ధాంత, పంచగవ్య చికిత్స పరిశోధనా కేంద్రం, చిన్నపిల్లల వార్డ్, లిచ్ థెరఫీ గది, కాయ చికిత్స వార్డు, పంచకర్మ వార్డు, సెంట్రల్ డ్రగ్ స్టోర్, డ్రెస్సింగ్ రూమ్, క్లీనికల్ ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, రక్త పరీక్ష కేంద్రం, ఎక్సరే విభాగాలను పరిశీలించారు. తరువాత ఎస్వీ ఆయుర్వేద కళాశాలలోని తరగతి గదులు, మ్యూజియం, గ్రంథాలయం, ఇతర విభాగాలను పరిశీలించారు. ఆయుర్వేద వైద్య విద్యార్థినుల హాస్టల్ భవనంలోని గదులను, డైనింగ్ హాల్, కిచెన్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థినులకు అందిస్తున్న వసతి, భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. శిల్ప కళాశాల ప్రాంగణంలో ఎంపోరియంను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఈ నాగేశ్వరరావు, ఎఫ్ ఏ అండ్ సిఏఓ బాలాజీ, ఎస్ఈ వెంకటేశ్వర్లు , డిఈవో భాస్కర్ రెడ్డి, అదనపు ఆరోగ్యాధికారి డా. సునీల్, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీ కష్ణ, ఆయుర్వేద ఆసుపత్రి సూపరిండెంట్ డా. రేణు దీక్షిత్ పాల్గొన్నారు.

శ్రీకోదండ రాముని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రజాశక్తి- తిరుపతి సిటి : తిరుపతి శ్రీకోదండరామస్వామి ఆలయంలో సోమవారం ఉదయం ధ్వజారోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కంకణబట్టార్ శ్రీఆనందకుమార దీక్షితులు ఆధ్వర్యంలో ఉదయం మేషలగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ ధ్వజారోహణంతో శ్రీ కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయన్నారు. 22న ఉగాది ఆస్థానం, 24న గరుడసేవ, 25న హనుమంత వాహనం, 27న రథోత్సవం, 28న చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు చందనంతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఎఇఒ మోహన్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి వైఎస్సార్సీపీ బీమా

ప్రజాశక్తి- కార్వేటినగరం :

మండల పరిధిలోని ఎల్ఆర్‌పేట పంచాయతీ వెంకటాద్రిపురం గ్రామానికి చెందిన జి.యువరాజ్ (45) గత కొన్నేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధుపడుతూ ఈనెల 18వ తేదీన మరణించారు. దీంతో వైఎస్సార్ భీమా పథకంతో తక్షణ సహాయం కింద వారి కుటుంబానికి రూ.10 వేలు నగదును సర్పంచ్ చిన్ని చేతులు మీదుగా అందించారు. అలాగే మతిని కుటుంబానికి సిఎం సహాయ నిధి కింద మరో రూ.30వేలు అందించి వారి కుటుంబాన్ని అందుకుంటుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కుష్బువాణి, వెల్ఫర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, వార్డు మెంబెర్ జనార్ధన్, వాలంటీరు మణి, పలువురు పాల్గొన్నారు.



రూ.10వేలు నగదును అందిస్తున్న సర్పంచ్ చిన్ని

ధ్వజస్తంభం ఏర్పాటుకు లక్ష విరాళం

ప్రజాశక్తి -సోమల: మండలంలోని 81చిన్నఉప్పరపల్లి పంచాయతీ పరిధిలోగల కమ్మపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి ధ్వజస్తంభం ఏర్పాటు కోసం ప్రముఖ పారిశ్రామికవేత్త రామచంద్ర యాదవ్ లక్ష రూపాయల విరాళాన్ని చెక్కు రూపంలో తన ప్రతినిధుల ద్వారా సోమవారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. 11 సంవత్సరాల క్రితం కోటి రూపాయల ఖర్చుతో ఆలయం నిర్మించడం జరిగిందని, అయితే ధ్వజస్తంభం మరమ్మతులకు గురికావడంతో విషయాన్ని రామచంద్ర యాదవ్‌కు తెలియజేయడంతో ఆయన లక్ష రూపాయల విరాళాన్ని అందజేసినట్టు కమిటీసభ్యులు తెలిపారు. విరాళాన్ని అందజేసిన రామచంద్ర యాదవ్‌కు, ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



కమిటీ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ప్రతినిధులు

టీడీపీ ఎమ్మెల్యేలపై దాడి హేయనీయం

ప్రజాశక్తి- నగరి: అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యే డోలా వీరాంజనేయ స్వామి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరెంట్ల బుచ్చయ్య చౌదరిపై దాడిచేయడం హేయనీయమని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గాలి భాను ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాసన సభను కౌరవ సభగా మార్చేస్తున్నారన్నారు. 75 ఏళ్ల వయసున్న ఎమ్మెల్యేపై అమానుషంగా దాడి చేయడాన్ని ఆయన ఖండిచాడు. వైసీపీ పాలన అంతా గూండాయిజంగానే కొనసాగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ఒక ఎమ్మెల్యేపై ఇలా దాడి ఘటన ఎప్పుడూ జరగలేదు. సీఎం జగన్ ప్రోద్భలంతో, ఒక వ్యూహంతోనే దళిత ఎమ్మెల్యే స్వామిపై దాడి చేశారు.

సదుం, బూరగ మంద పంచాయతీలలో

ముగిసిన గంగ జాతర



ప్రజాశక్తి- సోమల: సదుం పంచాయతీ, బూరగమంద పంచాయతీలలో సోమవారం భక్తుల కోలాహలం నడుమ గంగ జాతర ముగిసింది. మండల కేంద్రంలో బజారువీధిలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తులు పొంగళ్లను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బూరగమంద గంగ జాతర తిలకించేందుకు అమ్మవారి ఆశీస్సులు పొందేందుకు యువనాయకులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనకు గ్రామపెద్దలు జాతర నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి అమ్మవారి ఆశీస్సులను అందజేశారు. రెండు గ్రామాలలోనూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అలాగే కందూరు గ్రామంలో గంగ జాతర అంగరంగ వైభవంగా గ్రామపెద్దలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి మట్టి విగ్రహం నిమజ్జనంతో గంగ జాతర ముగిసింది.

ఆలయ పునరుద్ధరణ

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని కుప్పిగానపల్లి పంచాయతీ, కోటచెంబగిరి గ్రామంలోని 50 సంవత్సరాలుగా పాతబడ్డ అమ్మవారి ఆలయాన్ని పునరుద్ధరణ చేస్తానని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సర్పంచ్ రామ్మూర్తి ఆలయాన్ని పునరుద్ధరించారు. దీంతో సోమవారం గ్రామపెద్దల సమక్షంలో ఆలయ పునర్ధరణ జరిగిన తర్వాత అమ్మవారికి విశేషపూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటప్రకారం తాను, తన స్నేహితుల సాయంతో ఆలయ పనులు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల వైసిపి కో కన్వీనర్ హర్షం వ్యక్తం చేశారు.

పేద రోగికి 'ఎ' నెగిటివ్ రక్తదానం చేయండి

తిరుపతి సిటి : పేద రోగికి ఎ నెగిటివ్ రక్తదానం చేయాలని పిఆర్ఒ ఓ ప్రకటనలో కోరారు. స్విమ్స్ సిటీ సర్జరీ విభాగంలో చికిత్స పొందుతున్న నిరుపేద రోగి లీలావతి(37)కి అత్యవసరంగా ఎ నెగిటివ్ గ్రూపు రక్తం అవసరమని పేర్కొన్నారు. వివరాలకు 08772287777 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.